క్లుప్తంగా

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన



మేడిచర్లలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి

కె.కోటపాడు: ఈవీఎంలతో ఎన్నికల నిర్వహణ కచ్చితత్వంతో ఉంటుందని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి అన్నారు. మండలంలో మేడిచర్ల, కె.కోటపాడు గ్రామాల్లో శుక్రవారం ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించడంతో పాటు మాక్ పోలింగ్ జరిపారు. ఈవీఎంలపై ఏ విధంగా ఓటు వేయాలో సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ గాయత్రి, రాంబాబు, వీఆర్వో జగదీష్ పాల్గొన్నారు.

వైభవంగా అడవి రాజులబాబు పండగ



మాకవరపాలెంలో ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

మాకవరపాలెం: అడవిరాజులబాబు పండగను మండలంలోని మాకవరపాలెం, వజ్రగడ, రామన్నపాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ శివారులో ఉన్న అడవిరాజులబాబు ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. మాకవరపాలెంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే బూరుగుపాలెంలో పరిదేశమ్మ జాతరను స్థానికులు ఘనంగా జరిపారు.

ఘనంగా గ్రామదేవతల పండగలు



గ్రామదేవతకు పూజలు చేస్తున్న భక్తులు

గొలుగొండ: మండలంలో ఏఎల్‌పురం, కొత్త మల్లంపేట గ్రామాల్లో గ్రామదేవతలు పండగలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల ప్రజలు గ్రామదేవతల ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏటా ఫిబ్రవరి నెలలో నిర్వహించే ఈ పండగల్లో ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొంటారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌లో 137 మందికి వైద్యసేవలు



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు : సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు వైద్య సిబ్బంది సూచించే ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. చంద్రయ్యపేట గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 137 మందికి వైద్య పరీక్షలు జరిపారు. గర్భిణులకు డాక్టర్ నిర్మల పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, ఏఎన్‌ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

274 మంది విద్యార్థినులకు అట్టల పంపిణీ



విద్యార్థినికి అట్టను అందజేస్తున్న రామారావు, ప్రిన్సిపాల్ చిన్నమ్మలు

కె.కోటపాడు : ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు మంచి చదువులు చదవడం ఒక్కటే మార్గమని ఎ.కోడూరుకు చెందిన దొగ్గ మల్లమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రామారావు అన్నారు. మండలంలోని కింతాడలో గల కేజీబీవీలో విద్యార్థినులకు ట్రస్ట్ ద్వారా పరీక్ష అట్టలను సమకూర్చారు. పాఠశాలలో 6 నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకూ చదువుతున్న 274 మందికి వాటిని పంపిణీ చేశారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.



ఎ.కోడూరులో వైద్య సేవలపై సూచనలు చేస్తున్న అడిషినల్ డీఎంహెచ్‌వో జ్యోతి



రోగులకు చికిత్స చేస్తున్న వైద్యాధికారి సునీత



చుక్కపల్లిలో కిట్ అందజేస్తున్న ఎంపీపీ జయమ్మ

ఆరోగ్య సురక్ష.. ప్రజారోగ్యానికి రక్ష



ఏటి గైరంపేటలో రోగులకు ఆరోగ్యసురక్ష కార్డులు అందిస్తున్న వైద్యాధికారులు



పాపయ్యపాలెంలో మందులు అందజేస్తున్న ఎంపీపీ సత్యనారాయణ



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి హేమంత్

నర్సీపట్నం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరంలా మారిందని జిల్లా వైద్యాధికారి హేమంత్ అన్నారు. వైద్యరంగంలో సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, దీంతో మారుమూల గ్రామాల్లో సైతం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. నర్సీపట్నం మండలం, చెట్టుపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. గ్రామస్థాయిలోనే వైద్య సేవలు అందించడమే కాకుండా ఆరోగ్యశ్రీ పరిధిని పెంచి ప్రజలకు అన్నిరకాల వ్యాధులకు వైద్యం అందిస్తున్నారన్నారు. ప్రత్యేకించి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అందరి మన్ననలు పొందుతోందని చెప్పారు. క్యాంప్ మెడికల్ ఆఫీసర్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణికి పలు సూచనలు చేశారు. నలుగురు వైద్యులు 211 మందికి వైద్య సేవలు అందించారు. వైద్య సిబ్బంది వై.కృష్ణ, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: గ్రామీణ ప్రజలకు క్షేత్రస్థాయిలోనే మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నట్టు అడిషినల్ డీఎంహెచ్‌వో జ్యోతి తెలిపారు. మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు శైలజ, సాయికృష్ణ, ఆర్థోపెడిక్ వైద్యాధికారి నందకిషోర్, ఈఎన్‌టీ వైద్యాధికారి రమా రెడ్డి, కంటి వైద్యుడు రాజీవ్‌లోచన్‌లు 287 మందికి వైద్య పరీక్షలను చేశారు. శిబిరంలో అందుతున్న సేవలను అడిషినల్ డీఎంహెచ్‌వో జ్యోతి, మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో అప్పలరాజు పర్యవేక్షించారు. మరింత మెరుగైన వైద్యం అవసరమైన వ్యాధిగ్రస్తులను ఆస్పత్రులకు తీసుకెళ్లనున్నట్టు అడిషినల్ డీఎంహెచ్‌వో జ్యోతి, ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, పి.త్రినాథ్, సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, ఎంపీటీసీ లెక్కల గౌతమి, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని బుచ్చింపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శరబవరంలో శుక్రవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సుమారు 304 మందికి వైద్య నిపుణులు అనీష, సునీత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో రోగులకు అవసరమైన సదుపాయాలను వైస్ ఎంపీపీ దోనపర్తి వరలక్ష్మి, స్థానిక యువతతో కలసి కల్పించారు.

చీడికాడ: జగనన్న ఆరోగ్య సురక్షతో నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. మండలంలోని చుక్కపల్లిలో రెండవ విడత జగన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ కురచా జయమ్మ,సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ ప్రారంభించారు. పెదగోగాడ వైద్యసిబ్బందితో పాటు ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, ఎంపీటీసీ సుంకర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: ప్రజల చెంతకే వైద్యసేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసినట్టు ఎంపీపీ రుత్తల సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పాపయ్యపాలెంలో శుక్రవారం రెండో విడతగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి సచివాలయం పరిధిలోని పాపయ్యపాలెం, బుచ్చన్నపాలెం, ముషిడిపాలెం గ్రామాల నుంచి వచ్చిన 371 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని సందర్శించిన ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎంఈవో మూర్తి ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాల్‌ను ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇటంశెట్టి శ్రీను, పైల సత్తిబాబు, రుత్తల నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలో ఏటిగైరంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముంగర్లపాలెం, పీతఖండి, రామన్నపాలెం తదితర గ్రామాల నుంచి సుమారు 350 మంది హాజరయ్యారు. గొలుగొండ, చీడిగుమ్మల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.ధనుంజయ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పీహెచ్‌వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తారువలో అభివృద్ధి పనుల పరిశీలన



తారువలో కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం



మోదకొండమ్మ తీర్థం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బూడి ముత్యాల నాయుడు

దేవరాపల్లి: మండలంలోని తారువలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శుక్రవారం పరిశీలించారు. తారువ నుంచి ఎం.అలమండ వరకు రూ.1.50 కోట్లతో 3.6 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణ పనులను ఇప్పటికే పూర్తి చేశారు. ఇదే మార్గంలో పంట కాలువపై కల్వర్టుకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రస్తుతం చేపడుతున్నారు. ఈ పనులను డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు పరిశీలించి ఇంజినీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో పలు వీధుల్లో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సైతం ఆయన పర్యవేక్షించారు. నాణ్యతాప్రమాణాలను పక్కాగా పాటించాలని ఆయన ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

మోదకొండమ్మ తీర్థం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మాడుగుల: ఘనమైన చరిత్ర గల దేవత మాడుగుల మోదకొండమ్మని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు. శుక్రవారం తారువలో మోదకొండమ్మ తీర్థం వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 27న నిర్వహించనున్న తీర్థం సందర్భంగా అమ్మవారిని దర్శించుకోడానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా కమిటీ ఆధ్వర్యంలో పోలీసుల సహకారంతో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు మాట్లాడుతూ తీర్థాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబరు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- చోడవరం వ్యవసాయ మార్కెట్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో అభివృద్ధిపనుల శిలాఫలకాలను ప్రారంభిస్తున్న కరణం ధర్మశ్రీ

చోడవరం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం మార్కెట్ యార్డులో రూ.20 లక్షలతో నిర్మించిన షెడ్లు, ప్రహరీ, ఇతర మౌలిక సదుపాయలను ప్రభుత్వ విప్ ధర్మశ్రీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడకుండా నేరుగా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, వ్యవసాయాధికారుల సేవలను అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, అమ్మకాలు సజావుగా జరిగేందుకు, గిట్టుబాటు ధర కల్పించేందుకు వ్యవసాయ మార్కెట్ యార్డులను అభివృద్ధి చేసినట్టు చెప్పారు. రైతుకు భరోసా ఇవ్వడంతోపాటు రైతులకు ఏ కష్టం వచ్చినా వెంటనే ఆదుకునేందుకు సంక్షేమ నిధిని కూడా ఏర్పాటుచేసి అండగా ఉన్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ధర్మశ్రీ తెలిపారు. టీడీపీ హయాంలో రైతులు కుదేలయ్యారని, చంద్రబాబునాయుడు పాలనలో చాలా మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. వ్యవసాయాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో రైతులు బుద్ధి చెప్పాలని ధర్మశ్రీ కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు, కార్యదర్శి ఎస్. బంగరాజు, ఎంపీపీ గాడి కాసు, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకటరావు, సీతిన నాయుడు, లాలం హైమావతి, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట రావు, శానాపతి శ్రీనివాసరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవాన్ని విజయవంతం చేయండి

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



విగ్రహాల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించిన రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. శనివారం విగ్రహాల ఆవిష్కరణను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. విగ్రహాల ఏర్పాటు పనులు ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్‌ను రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.6 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. రోడ్డు నిర్మాణ పనులకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది శంకుస్థాపన చేశారని తెలిపారు. నర్సీపట్నం వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి కొత్తవీధి మీదగా పెదబొడ్డేపల్లి వరకు 2.30 కిలోమీటర్ల మేర రోడ్డు వేయాల్సి ఉండగా 70 శాతం రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసినట్టు చెప్పారు. పక్కనే చెరువు ఉండడంతో ట్యాంక్ బండ్‌ను తలపించే విధంగా రోడ్డును సుందీకరించాలనే ఆలోచనతో రోడ్డు పొడవునా మొక్కలు నాటి, 13 మంది దేశనాయకుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పట్టణంలో డాక్టర్లు, న్యాయవాదులు, వివిధ సంఘాల నాయకులను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశామన్నారు. రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ విచ్చేసి జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఏకాశివ, మున్సిపల్ వైస్‌చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, దుర్గామల్లేశ్వరిదేవి టెంపుల్ చైర్మన్ వికాస్ సతీష్, పార్టీ నాయకులు యాదగిరి శేష్, బేతిరెడ్డి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్



కాశీపురం హైస్కూల్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ప్రధానోపాధ్యాయురాలు పి.బి.టి. సుందరి ఆధ్వర్యంలో ఫేర్‌వెల్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో-2 వి.ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థులంతా ఇష్టపడి చదివి, పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ దాసరి సూర్యనారాయణ, గ్రామ పెద్దలు బండారు దేముడునాయుడు, ఆదిరెడ్డి సింహాచలం నాయుడు, ఆదిరెడ్డి చినకన్నబాబు, ఉపాధ్యాయులు సుజాత, రామలక్ష్మి, కొట్టాన రాంబాబు, పూర్ణిమ, సత్యవతి, సూర్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత తీర్థం

అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



సంతోషిమాత ఆలయం వద్ద మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే ధర్మశ్రీ

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత ఆలయం వద్ద వార్షిక తీర్థమహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అమ్మవారిని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. ఆయనతో పాటు పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు అమ్మవారి చిత్రపటాలను అందజేసి, సత్కరించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ కె.జె.పురం ప్రధాన కూడలి ఆధ్యాత్మికతకు వేదికగా మారిందని, ఇక్కడ ఆలయాల్లో పూజలు, సంతోషిమాత ఆలయంలో నిత్యాన్నదానం నిర్వహించడం సంతోషకరమన్నారు. తీర్థం సందర్భంగా ముగ్గులు, కబడ్డీ, సైకిల్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలు

చీడికాడ: మండలంలోని అర్జునగిరిలో జిల్లా స్థాయి ఎడ్ల పరుగుపోటీలను శనివారం నిర్వహించనున్నారు. స్వయంభూ శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ వరహాలక్ష్మీ నృసింహాస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా దేవాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎడ్లపరుగు పోటీలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు సంత వేలం

మాకవరపాలెం: మండల కేంద్రంలో ప్రతి మంగళవారం జరిగే వారపు సంతలో ఆశీల వసూలుకు శనివారం వేలం నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీవో జాన్‌లింకన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఈ వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనే పాటదారులు ముందుగా రూ.25 వేల డీడీతోపాటు రూ.4 లక్షల మోతుబరి ధ్రువీకరణ పత్రం అందజేయాలన్నారు.

వలంటీర్ల గౌరవాన్ని పెంచుతాం

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



తురకలపూడి వలంటీర్లను సత్కరిస్తున్న విప్ ధర్మశ్రీ,నాయకులు



రాజాం వలంటీర్లను సత్కరిస్తున్న విప్ ధర్మశ్రీ



చోడవరంలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

బుచ్చెయ్యపేట: వైఎస్సార్‌సీపీ రెండో సారి అధికారం చేపట్టిన తరువాత వలంటీర్ల గౌరవాన్ని మరింత పెంచుతామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. శుక్రవారం తురకలపూడి, రాజాం,మల్లాం, తైపురం, ఆర్.శివరాంపురం గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల వలంటీర్లను రాజాంలో ఘనంగా సన్మానించి, ప్రభుత్వం అందించిన సేవారత్న,సేవామిత్ర అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను అవినీతికి తావు లేకుండా లబ్ధిదారులకు అందిస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, పథకాలను అందిస్తున్న వలంటీర్లను తొలగిస్తామని టీడీపీ చెబుతోందని, అధికారం కోసం పాకులాడుతున్న తెలుగుదేశం పార్టీ భూ స్థాపితం అయ్యేలా వలంటీర్లు కృషి చేయాలని కోరారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు జోగా కొండబాబు,మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు,వడ్డాది టౌన్ అధ్యక్షుడు డి. నారాయణ మూర్తి, సర్పంచ్‌లు, నాయకులు మరిసా నాని, ముచ్చకర్ల శ్రీను, మూడెడ్ల శంకర్రావు, అమ్మునాయుడు, బర్ల శివ,పడాల నాగభూషణం, నమ్మి అప్పలరాజు, గొల్లవిల్లి సత్యనారాయణ, పుణ్యగిరి నాయుడు, కర్రి నాయుడుబాబు, కోరుకొండ రమణ, పల్లా పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో ...

చోడవరం: ఉత్తమ సేవలందించిన గ్రామ వలంటీర్లను శుక్రవారం ఇక్కడ ఘనంగా సత్కరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్ల వందనం కార్యక్రమంలో భాగంగా నగదు, ప్రోత్సాహక పతకాలు అందించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా చోడవరం పట్టణంలోని సచివాలయం-1 పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లకు దుశ్శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, కార్యదర్శి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు



ఆలయంలో ప్రతిష్టించిన వేణు గోపాలస్వామి విగ్రహం

రోలుగుంట: మండలంలోని వడ్డిప గ్రామంలో ఈ నెల 21 ప్రారంభమైన వేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మండలస్థాయి భజన పోటీల్లో పలు గ్రామాల నుంచి ఎనిమిది బృందాలు పాల్గొని స్వామివారి కీర్తనలు ఆలపించాయి. విజేతలకు ఈ నెల 28న బహుమతి ప్రదానం జరుగుతుందని నిర్వాహకులు, ఆలయ కమిటీ చైర్మన్ మిరియాల సత్యానారాయణ, సభ్యులు నక్కా రామారావు,గజ్జి నర్సింగరావు తదితరులు తెలిపారు.

నేడు సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన



సీతారాముల విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

మాకవరపాలెం: మండలంలోని తామరంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.